అవినీతికి 'ప్లాన్'!

పెద్దఅంబర్‌పేట్ టౌన్‌లో భారీగా అక్రమ నిర్మాణాలు

ప్రతీ నిర్మాణానికి ఓ లెక్కన వసూళ్లు.. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిదే హవా..?

అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అక్రమ వసూళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పెద్దఅంబర్‌పేటలో పెద్దపెద్ద భవంతుల నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అనుమతి ఒకలా తీసుకుని.. నిర్మాణాలు మరొలా చేడపతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న పట్టణ ప్రణాళిక విభాగంలోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది యథేచ్ఛగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. తాము చెప్పిందే వేదమంటూ ఇష్టారీతిన వ్యవహరిస్తుండడంతో పలువురు భవన నిర్మాణ దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు మున్సిపల్ ఉన్నత అధికారి పర్యవేక్షణ లేకపోవడంతోనే ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఔట్‌సోర్సింగ్‌దే హవా...?

జీహెచ్‌ఎంసీకి అనుకుని ఉన్న పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో కొంత కాలంగా పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీలో 8 గ్రామాలు కొనసాగుతుండగా పట్టణ ప్రణాళిక విభాగంలో రెగ్యులర్ అధికారి లేకపోవడం విడ్డూరం. దీంతో ఆ విభాగంలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న సిబ్బంది తమ హవాను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పట్టణ ప్రణాళిక విభాగంలో డిప్యూటేషన్‌పై టీపీవో కేవలం వారంలో రెండు రోజులు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా...ముగ్గురు ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులల్లో కొనసాగుతున్నారు. ఈ మధ్య కాలంలో టీపీవో ఒక రోజు మాత్రమే పెద్దఅంబర్‌పేట్‌కు వచ్చిపోతున్నట్లు తెలిసింది. దీంతో అక్రమ నిర్మాణాల విషయంలో వారిదే పైచేయిగా నిలుస్తోంది. అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయని సమాచారం అందితే చాలు ఇక వారికి పండుగే. భవన యజమానులకు నోటీసులు ఇచ్చినట్టే ఇచ్చి వారి వద్ద అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

నిర్మాణాన్ని బట్టి రేటు ఫిక్స్..

ఈ ఏడాది జనవరిలో మున్సిపాలిటీ పాలకవర్గం పదవికాలం ముగియడంతో పాలన పడకేసింది. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిర్మాణాలను బట్టి రేటు ఫిక్స్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లినా.. వారిపై ఏలాంటి చర్యలు తీసుకోకుండా తిరిగి అదే శాఖలో కొనసాగిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతికి పాల్పడుతున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై పెద్దఅంబర్‌పేట మున్సిపల్ ప్రత్యేక అధికారి, సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేక వారినే కొనసాగిస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

రేపు ఆర్టీసీ కార్గో పార్శిళ్ల వేలం

చాదర్‌ఘాట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో, పార్శిల్ కౌంటర్‌కు చేరిన తర్వాత డెలివరి తీసుకోని వస్తువులను ఈ నెల 29న మహాత్మా గాంధీ బస్‌స్టేషన్‌లోని పార్శిల్ గోడౌన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు హైదరాబాద్ జోన్ లాజిస్టిక్ మేనేజర్ బద్రి నారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ వస్తువులు, ఐరన్, బైక్, కార్ల విడి భాగాలు, కంప్యూటర్ స్పేర్ పార్ట్స్ దుస్తులు, ప్లాస్టిక్, బుక్స్, రెగ్జిన్ తదితర వస్తువులను వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9391778825, 9154298865 ద్వారా సంప్రదించవచ్చని బద్రి నారాయణ చెప్పారు.


లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గండిచెరువు, లష్కర్‌గూడ, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, ఇనాంగూడ, పిగ్లీపూర్ బండరావిరాల గ్రామాల్లోని 36 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామన్నారు. సీఎంతో మాట్లాడి నియోజకవర్గానికి అదనంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, ప్రభాకర్‌గౌడ్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, దర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో చంపాపేట ముందంజ: కార్పొరేటర్

చంపాపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో చంపాపేట డివిజన్ అన్ని రంగాలలో ముందంజలో ఉందని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పద్మానగర్‌కాలనీలో రూ.2కోట్లతో స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ నిర్మాణం, రూ.20లక్షలతో సాయిరాంనగర్‌కాలనీలో చేపట్టనున్న సీసీ రహదారుల నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లోని అన్ని కాలనీలు శరవేగంతో అభివృద్ధి చెందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివసాయిరాం, సాయిరాంనగర్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


మీనాకు మొక్క అందజేసి అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ 2025 మీనా ఎంపిక

హయత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -2 వలంటీర్ మీనా ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ 2025కు ఎంపికైంది. ఈ మేరకు మీనా పది రోజుల పాటు గుజరాత్ రాష్ట్రం పటాన్‌లోని హేమచంద్రాచార్యా నార్త్ గుజరాత్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 31 నుంచి నవంబర్ 9 వరకు శిక్షణ తీసుకుంటుంది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఆఫీసర్లు శారదాదేవి, యాదగిరిరెడ్డి, అధ్యాపకులు రమాదేవి, సుబ్రమణ్యం, బాల, ధన్‌రాజ్ దుర్గాప్రసాద్‌లు మీనాను అభినందించారు.


కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో ఛట్ పూజలు

చంపాపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో సోమవారం ఉత్తర్ భారతి నాగరిక్ సంఘ్ హైదరాబాద్ చైర్మన్ ఎన్‌కే సింగ్ ఆధ్వర్యంలో ఛట్ పూజలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో లావణ్య హాజరై వారితో కలిసి ఛట్ పూజలు నిర్వహించారు. అదే విధంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి రామాలయం దేవస్థానం ఆవరణలో ఆకాశదీపంను ఆలయ ఈవో లావణ్య వెలిగించారు. అనంతరం మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్, కిరణ్, అర్చకులు శంకరశర్మ, సంతోష్, సిబ్బంది రమాదేవి, స్వాతి, సుజాత, సంఘ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యుల చేత ప్రమాణం చేయిస్తున్న ఎన్నికల అధికారి టాగూరు ఇందర్‌సింగ్

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

చంపాపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం చాంద్రాయణగుట్ట యూనిట్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, ఎన్నికల అధికారి టాగూరు ఇందర్‌సింగ్ తెలిపారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం చంద్రాయణగుట్ట యూనిట్ అధ్యక్షుడుగా సుభాష్‌చంద్ మార్వాడి, కార్యదర్శిగా కిషన్‌ప్రసాద్ కపుర, అసోషియేటెడ్ అధ్యక్షులుగా పరమేశ్వర్‌ప్రసాద్, ఫైనాన్స్ కార్యదర్శిగా అనిల్‌రుదన్‌రావు, ఉపాధ్యక్షుడిగా క్రిష్ణా, మహిళా ఉపాధ్యక్షులుగా గీతారాణి, జాయింట్ సెక్రటరీగా విజయకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోహన్‌జాదవ్, ప్రచార కార్యదర్శిగా మాలతీకపూర్‌లు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులచే వారు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగి వీణా మృతికి సంతాపం తెలుపుతూ వారు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: టీటీఐ సీఐ అర్జున్


విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న టీటీఐ సీఐ అర్జున్ రాచపుడి

కొత్తపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి సూచించారు. సోమవారం హయత్‌నగర్‌లోని 55 మంది ప్రైవేటు స్కూల్ విద్యార్థులు పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. వారికి ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. అదే విధంగా టీటీఐ అధికారులు 20 ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. 83 మంది మద్యంప్రియులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రైనర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు కొమురం భీం: యాదిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి ప్రజల జల్, జంగల్, జమీన్ హక్కుల కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధుడు కొమురం భీం అని సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. సోమవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్‌ఎన్‌ఆర్ కాలనీ ఫేజ్-3 భూ పోరాట కేంద్రంలో కొమురం భీం 85వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదిరెడ్డి ముఖ్య అతిధిగా హాజరై కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్యలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. భూపోరాట కేంద్రంలో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి హరిసింగ్‌నాయక్, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్‌రెడ్డి, నరసింహ, ప్రసాద్, యాదగిరి, శోభన్, బిచ్చునాయక్, గోపి, వీరేష్, యాదగిరి, శ్రీధర్ పాల్గొన్నారు.


కొమురం భీం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు యాదిరెడ్డి తదితరులు


జీఎంకు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

డ్రైనేజీ పనులు చేపట్టండి: కార్పొరేటర్

కొత్తపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో మంజూరైన డ్రైనేజీ పనులు వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి జీఎం బలరాంకు, ఏఈ స్రవంతిరెడ్డిలకు విన్నవించారు. సోమవారం ఆయన జలమండలి కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. కొత్తపేట జనప్రియ క్వార్టర్స్‌లో నీటి బిల్లులు అధికంగా వస్తున్నాయని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. మారుతీనగర్, కామినేని చౌరస్తా సమీపంలోని శ్రీశంకర్‌కాలనీ, భరత్‌నగర్, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రవీంద్రవర్మ, కాలనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో ఎన్‌సీడీసీ క్యాంపు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 4వ వార్డు శాంతినగర్ (లెప్రసీకాలనీ)లో సోమవారం ఎన్‌సీడీసీ క్యాంప్ నిర్వహించారు. సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్ (స్లాప్) రాష్ట్ర అధ్యక్షుడు మరియాదా రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంప్‌లో పెద్దఅంబర్‌పేట్ బస్తీ దవాఖానా డాక్టర్ రుద్రామాదేవి, డీపీఎంఓ శాంతిరాజ్‌లు హాజరై కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 50 మందికి బీపీ, షుగర్, సాధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్టు వైద్యులు తెలిపారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

● **బీఎస్పీ నేత జగన్**

మన్సూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను కల్పించాల్సిందేనని బీఎస్పీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి జగన్, అధ్యక్షుడు వేముగంటి సంపత్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ 1న ఇందిరాపార్కు వద్ద చేపట్టే ధర్నాకు సంబంధించిన పోస్టరును సోమవారం ఎల్బీనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ, బీసీల రిజర్వేషన్ ధర్నాకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ నాయకత్వంలోని తమ పార్టీ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. బీసీలకు న్యాయపరంగా దక్కాల్సిన 42శాతం రిజర్వేషన్‌ను 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలన్నారు. ఈ ధర్నాలో బీసీ సంఘాల నాయకులు, మేధావులు, పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీఎస్పీ నాయకులు సాయిరామకృష్ణ, శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఫిన్లాండ్ కాన్సుల్ జనరల్ సభ్యులు

శాంక్టస్ వరల్డ్ స్కూల్‌ను సందర్శించిన ఫిన్లాండ్ కాన్సుల్ జనరల్ సభ్యులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్య అనేది సృజనాత్మకతను పెంచే రీతిలో ఉండడంతో పాటుగా సానుభూతి, జీవితాంతం నేర్చుకోవడాన్ని ప్రోత్సహించేలా ఉండాలని ఫిన్లాండ్ కాన్సుల్ జనరల్ సభ్యులు అన్నారు. ఫిన్లాండ్ కాన్సుల్ జనరల్ ఎరిక్ అఫ్ హాల్‌స్ట్రామ్ బీఎన్‌రెడ్డి నగర్‌లోని శాంక్టస్ వరల్డ్ స్కూల్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా 'సెయిలింగ్ థ్రూ గ్లోబల్ ట్రెడిషన్స్' నేపథ్యంతో స్కూల్‌లో ఏర్పాటుచేసిన ఓ ప్రదర్శనను వీక్షించారు. కార్యక్రమంలో శాంక్టస్ వరల్డ్ స్కూల్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ డబ్బులు వెంటనే చెల్లించాలి

● **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్**

మన్సూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏడాది గడిచినా రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నేటికీ పెన్షన్ డబ్బులు అందలేదని, ప్రభుత్వం వెంటనే అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏటీ) సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఎస్‌జీపీఏటీ సభ్యులు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీపీఏటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సలహాదారు మల్లయ్యలు మాట్లాడుతూ, మార్చి 2024 నుంచి నేటి వరకు సుమారు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటైర్డ్ అయ్యారని, ఒక్కో పెన్షనర్‌కి రూ.40లక్షల నుంచి 50లక్షల వరకు ఉన్న బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ 5 కరువు భత్యం బకాయిలు లేవని, వెంటనే భత్యాలను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీపీఏటీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, కోశాధికారి రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అనంతరెడ్డి, సత్యనారాయణరెడ్డి, డేవిడ్ పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌జీపీఏటీ సభ్యులు

'సెల్‌టవర్ నిర్మాణ పనులను అడ్డుకోండి'


పెద్దఅంబర్‌పేట్‌లోని వినాయకనగర్ కాలనీ ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులను అడ్డుకోవాలని కోరుతూ సోమవారం కాలనీ వాసులు కమిషనర్ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

- అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)

బీసీ జేఏసీ ఎల్బీనగర్ నూతన కమిటీ ఆవిర్భావం


యాదగిరి

వనస్థలిపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం బీసీ జేఏసీ నూతన కమిటీ ఆవిర్భవించింది. ఈ మేరకు సోమవారం బీఎన్‌రెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన బీసీ ఉద్యమనేతల సమావేశంలో బీసీ జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా యాదగిరినేత, వైస్ చైర్మన్‌గా మల్లేష్‌గౌడ్, శ్రీకాంత్, పుష్పలీల, కన్వీనర్‌గా శ్యామ్‌సుందర్‌యాదవ్, కో కన్వీనర్‌గా యాదగిరి, రవీంద్రనాయి, శంకర్, రమేష్, శ్రీనివాస్, శ్రీనివాస్, మీడియా ఇన్‌చార్జిగా మహేష్, శ్రీనివాస్, మహిళా ఇన్‌చార్జిగా ఉపేంద్ర యాదవ్‌లను ఎన్నుకున్నట్లు బీసీ ఉద్యమ నాయకులు రఘురాం, రాజు, శ్యాంసుందర్‌గౌడ్‌లు తెలిపారు.

ఫార్మసీ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● **జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డా.శోభారాణి**

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డా.శోభారాణి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఫార్మసీ కళాశాలలో సోమవారం ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి డా.శోభారాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ ఫార్మా రంగంలో భారత్ దూసుకుపోతోందన్నారు. ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గౌరవ అతిధులు రామయ్య, బ్రహ్మకుమారీస్ సిస్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్, కళాశాల డైరెక్టర్ డా.జయప్రద, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భర్తను కడతేర్చిన భార్య అరెస్ట్


సంధ్య, నిందితురాలు

సరూర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుపడుతూ మద్యం తాగి తనను వేధిస్తున్నాడనే కోపంతో భర్తను హత్య చేసిన భార్యను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లెలగూడ ప్రగతినగర్‌కు చెందిన సంధ్య(34), భర్త విజయ్‌కుమార్‌ను ఈ నెల 20న హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం ఆమెను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.

ఫర్నిచర్ కొంటానంటూ..రూ.90వేలు తస్కరణ

కొత్తపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉపాధ్యాయురాలికి చెందిన ఫర్నిచర్ కొంటానంటూ ఓ వ్యక్తి క్యూఆర్ కోడ్ పంపి రూ.90 వేలు దోచుకున్నాడు. ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ సద్గురునగర్ రోడ్‌లో ఉండే ఈశ్వరీబాయి(66) తన వద్ద ఉన్న ఫర్నిచర్‌ను విక్రయిస్తున్నానంటూ ఓఎల్‌ఎక్స్‌లో వివరాలు పోస్టు చేశారు. ఈ నెల 26న ఒక గుర్తు తెలియని వ్యక్తి 9829718568 నుంచి వాట్సప్‌లో ఆమెను సంప్రదించాడు. ఫర్నిచర్ కొంటానని, అందుకు ఒక్క రూపాయి పంపాడు. తిరిగి ఆమెను ఆ రూపాయి పంపాలని కోరాడు. అందుకు పేమెంట్ క్యూఆర్‌కోడ్ పంపి ఆమెకు సూచనలు చేశాడు. వెంటనే ఆమె ఖాతా నుండి అతడి ఖాతాకు రూ.90 వేలు బదిలీ అయ్యాయి. దీంతో బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది.

మేమంతా పోలీసుల వెంటే

● **వాక్ ఫర్ పోలీసు ర్యాలీలో నినదించిన విద్యార్థులు**

చాదర్‌ఘాట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసులకు తామంతా అండగా ఉంటామని విద్యార్థులు నినదించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్‌ఐలు సంజీవరెడ్డి, తేజానాయక్, రాజశేఖర్‌రెడ్డిల సంయుక్తాధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ నుంచి నిర్వహించిన వాక్ ఫర్ పోలీస్ ర్యాలీని మలక్‌పేట ఏసీపీ సుబ్బిరామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి పాల్గొని రక్తదానం చేసిన దాతలను అభినందించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి ఆయన అభినందించారు.



అడిషనల్ డీసీపీ శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్‌రెడ్డి

సైదాబాద్‌లో..

సైదాబాద్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సైదాబాద్, మలక్‌పేట డివిజన్ల పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సైదాబాద్‌లోని ఎలైట్ కన్వెన్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 400యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు సౌత్‌ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో సైదాబాద్, మలక్‌పేట ఏసీపీలు వెంకట్‌రెడ్డి, సుబ్బిరామిరెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

● శాంతి ర్యాలీ



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం పోలీసులు శాంతి ర్యాలీని నిర్వహించారు. నాగోల్ చౌరస్తా నుంచి చేపట్టిన సైకిల్ శాంతి ర్యాలీని డా.అనురాధరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏసీపీ కృష్ణయ్యగౌడ్, అదనపు ఏసీపీ కోటేశ్వర్‌రావు, సీఐలు, ఎస్‌ఐలు, విద్యార్థులు పాల్గొన్నారు.- **మన్సూరాబాద్ ,ఆంధ్రజ్యోతి**

వాకర్స్‌పై అడవిపంది దాడి.. ఓ వ్యక్తికి గాయాలు

మన్సూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తున్న వారిపై అడవిపంది దాడి చేయగా ఓ వ్యక్తికి గాయాలైన ఘటన ఎల్బీనగర్‌లోని మహవీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కులో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహవీర్ హరిణవనస్థలి జాతీయ పార్కులో చాలా మంది నిత్యం వాకింగ్‌కు వెళ్తుంటారు. రోజూ మాదిరిగానే నాగోల్ రాక్‌టౌన్‌కాలనీకి చెందిన అరవింద్‌రెడ్డి ఉదయం 5.30 గంటలకు వాకింగ్ చేసేందుకు పార్కుకు వెళ్లాడు. తన స్నేహితులతో కలిసి ఆయన వాకింగ్ చేస్తుండగా హఠాత్తుగా ప్రత్యక్షమైన అడవిపంది వాకింగ్ చేస్తున్న వారిపై దాడికి దిగింది. ఈ దాడిలో గాయపడిన అరవింద్‌రెడ్డిని వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగదీష్‌యాదవ్, వాకర్స్ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా ఈ దాడిలో అరవింద్‌రెడ్డి కాలుకి గాయాలయ్యాయి.